క్లుప్తంగా

రంగస్థల కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరించిన కృష్ణస్వామి

నల్లజర్ల: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి వేడుకల సందర్భంగా మండలంలోని పోతవరం రామాలయం వద్ద శనివారం రంగస్థల కళాకారులను ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతల్లో అట్టూరి వీరకాంతం, ప్రత్తిపాటి కేశవరాణి, లతా మంగేష్కర్, వాయిద్య కళాకారులు నిండ్రకొలను నరసింహమూర్తి, పేరాళ్ల బైరాగి, ప్రత్తిపాటి కృష్ణ తదితరులు ఉన్నారు.ప్రముఖ ఘంటసాల గాయకుడు దంతోజు కృష్ణస్వామి ఆధ్వర్యంలో వారిని సత్కరించారు.

17,18 తేదీల్లో గోగులమ్మ వారి జాతర

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామ దేవత అయిన గోగులమ్మ వారి జాతరను ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తారు. 11 ఏళ్లకు ఒకసారి ఈ అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 17న అమ్మవారికి పూజలు, సాయంత్రం ఆమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈనెల 18న నైవేద్యాల సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయి. జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్తు దీపాలు, భారీ సెట్టింగులతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. అలాగే తాడిపర్రు గ్రామంలోని ప్రతి సెంటర్‌ను, వీధిని విద్యుత్తు దీపాలతో ఆలంకరించారు.

అయ్యప్ప స్వామి తిరువాభరణాల ఊరేగింపు

కొవ్వూరు: గోష్పాద క్షేత్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృతాలతో అభిషేకించారు. స్థానిక సత్యవతీ నగర్‌లో నుంచి స్వామి వారి తిరువాభరణాలను మేళతాళాలతో పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.40 గంటలకు మకర జ్యోతి దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులు స్వామి వారికి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గురుస్వామి నున్న సాయి, పాలడుగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాలకు చేరువ కావాలి

దేవరపల్లి: యువత రాజకీయాలకు చేరువ కావాలని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ నాయకుడు డి. సువర్ణరాజు కోరారు. దేవరపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో నిర్వహించిన యువజనోత్సవాలు విజయవంతం అయ్యాయని, సుమారు 10 వేల మంది యువకులు సభకు హాజరయ్యారని చెప్పారు. రాష్ట్రంలో యువశక్తి నిర్వీర్యం అవుతోందన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగం ,రాజకీయాలకు యువతను చేరువ చేయవలసి ఉందన్నారు. నియోజవర్గంలో 50 శాతం గ్రామ కమిటీల ఏర్పాటు చేశామన్నారు. జరిగిందన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో జనసేన భారీ బహిరంగ సభను త్వరలోనే ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామ సమీపంలో టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న మీనానగరానికి చెందిన కట్టా శ్రీనివాస్ అనే వ్యక్తిని శనివారం వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. శ్రీనివాస్ ఐ.పంగిడిలో పనిచేస్తున్న తన కుమారుడికి భోజనం తీసుకు వెళుతూ ఈ ప్రమాదం బారిన పడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కొవ్వూరు ఎస్సై జి.సతీష్ తెలిపారు.

భోగి వెలుగులు .. ముగ్గుల వాకిళ్లు

- సంక్రాంతి సందడి ప్రారంభం
- భోగి మంటల వద్ద యువత, చిన్నారుల సందడి
- వెల్లివిరుస్తున్న తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు



కొవ్వూరు గాయత్రీ థియేటర్ రోడ్డులో భోగి మంట



తాళ్లపూడిలో హరిదాసుకు బియ్యం పోస్తున్న చిన్నారి



పసలపూడిలో మహిళ వేసిన సంక్రాంతి ముగ్గు

కొవ్వూరు: పల్లెలు, పట్టణాలు సంక్రాంతి కళకళను సంతరించుకున్నాయి. భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసులు, డూడూ బసవన్నలతో ఎక్కడ చూసినా ఒకటే కోలాహలం నెలకొంది. తెలుగు వారి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ప్రతి ఇల్లూ బంధువులు, స్నేహితులతో సందడిగా మారింది. కొవ్వూరు పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో శనివారం భోగి మంటలు వేశారు. పొగమంచుతో పాటు తెల్లవారు జాము నుంచి చలి బాగా పెరిగింది. చిన్నారుల తలపై భోగి పండ్లు పోశారు.ఆవు పేడతో చేసిన పిడకల దండను మంటల్లో వేసి కుటుంబ సమేతంగా మంట చుట్టూ తిరిగారు.

చాగల్లు: భోగి సందర్భంగా శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి చన్నీటి స్నానాలు చేసి వీధుల్లో వేసిన భోగి మంటల వద్ద చేరారు. భక్తులతో దేవాలయాలు కళకళలాడాయి. చాగల్లు గ్రామదేవత పాటమ్మ అమ్మవారి వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి గుడిని ప్రత్యేకంగా అలంకరించారు. బ్రాహ్మణగూడెంలోని నాగారమ్మ, ఊనగట్ల, చిక్కాల గ్రామ దేవతలకు కూడా వేడుకలు నిర్వహించారు.

తాళ్లపూడి: పల్లెల్లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. హరిదాసులు హరినామ సంకీర్తనలు చేసుకుంటూ వీధుల్లో తిరిగారు. ఇంటింటా మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా వారికి కానుకలు సమర్పించారు. సంక్రాంతి సందర్భంగా బంధువులు, కొత్త అల్లుళ్ల రాకతో ఇళ్లు కళకళలాడుతున్నాయి.

నిడదవోలు: స్థానిక గణేష్ చౌక్ సెంటర్లో నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు దంపతులు శుక్రవారం రాత్రి భోగి మంట వెలిగించి పండగను ప్రారంభించారు. నిడదవోలు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో తోలేటి కోటి తదితరులు పాల్గొన్నారు. జ్యోతిర్మయి దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక వడ్డీల వీధిలో దివ్యాంగ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, చిలకల శారదాదేవి వ్యవహరించారు. విజేతలకు ఎస్సై పి.నాగరాజు చేతుల మీదుగా నగదు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నిడదవోలు రూరల్: భోగభాగ్యాలను అందించే భోగి పండగను నిడదవోలు మండలంలోని ప్రజలంతా శనివారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఇళ్ల ముందు, వీధుల్లో పెద్ద పెద్ద దుంగలు, కలపతో భోగి మంటలు వేశారు. చిన్నారులపై భోగి పండ్లు పోశారు. తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మను విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తాడిమళ్లలోని రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి దేవస్థానంలో నగర సంకీర్తన, స్వామివారికి విశేష అర్చనలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం, వేలివెన్ను, కాల్దారి, తాడిపర్రు, సూర్యారావుపాలెం, పాలంగి, చివటం గ్రామాల వీధుల్లో యువకులు పోటాపోటీగా భోగి మంటలు వేశారు. శుక్రవారం రాత్రి నుంచే యువకులు, చిన్నారులు భోగి మంటల కోసం, కలప, దుంగలు, చెక్కలు సేకరిస్తూ సందడి చేశారు. తెల్లవారుజామునే భక్తి శ్రద్ధలతో భోగి మంటలల్లో పిడకలు వేసి సంప్రదాయాన్ని చాటారు. ఉండ్రాజవరంలో బ్రాహ్మణ సేవా సమితి సంఘం భవనం వద్ద భోగి మంట వేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మండలంలో పసలపూడిలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకి సర్పంచ్ కట్టా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కట్టా విజయలక్ష్మి, పార్టీ నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. పాల్గొన్న వారందరికీ కన్సొలేషన్ బహుమతులు అందించారు.





ఉండ్రాజవరంలో అ'పూర్వ' సమ్మేళనం



ఉండ్రాజవరం హైస్కూల్ 1995-96 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

ఉండ్రాజవరం: స్థానిక ఉన్నత పాఠశాల 1995–96 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం ఆ హైస్కూల్ ప్రాంగణంలో కోలాహలంగా సాగింది. అప్పటి విద్యార్థులందరూ ఒకరినొకరు పేరు పెట్టి పిలుచుకుంటూ యోగక్షేమాలను, కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కుంటుంబాలతో సహా రావడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. భోగి రోజున ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంతో పాఠశాల ప్రాంగణంలో భోగి మంట వేశారు. పిండి వంటలు చేసుకుని విందు వినోదాలతో ఆనందంగా గడిపారు.

ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: స్థానిక పెడసనగంటి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు చేతుల మీదుగా 650 మంది పేదలకు దేవరపల్లిలో నూతన వస్త్రాలు, దుప్పట్లు అందజేశారు. పరమేశు బయోటెక్ పరిశ్రమ అధినేత ఆనంద్ స్వరూప్, నియోజకవర్గ జనసేన నాయకుడు డి.సువర్ణరాజు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, మాధవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దేవరపల్లికి చెందిన టి ముకుంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక దళితవాడలోని 100 పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు ఆ సంస్థ చైర్మన్ తంగెళ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు.

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట షాలెం ప్రేయర్ ఫిలోషిప్ చర్చి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆ చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వాదాలకుంట సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ దంపతులు ఆర్థిక సహాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు.

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము 4 గంటల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని క్యూలో నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు.కాగా స్వామి వారి ఆలయానికి విశాఖపట్నంకు చెందిన పుల్లూరి సావిత్రి తన భర్త బుల్లెబ్బాయి జ్ఞాపకార్థం రూ.1,01,116 విరాళంగా సమర్పించారు.

శశిధర్ క్రికెట్ టోర్నీ విజేత చోటా రైడర్స్ జట్టు

ఉండ్రాజవరం: శశిధర్ మెమోరియల్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని వేలివెన్ను శశి విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో సమిశ్రగూడెంకు చెందిన చోటా రైడర్స్ జట్టు ఘన విజయం సాధించింది. శనివారం నిర్వహించిన ఫైనల్స్‌లో ఆ జట్టు నిడదవోలు బసివిరెడ్డి పేట జట్టును 33 పరుగుల తేడాతో ఓడించి విజేతగా నిలిచింది. చోటారైడర్ జట్టులోని డేవిడ్ 45 పరుగులు చేసి, రవికిరణ్ 3 వికెట్లు సాధించి ఆ జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. విజేత జట్టుకు ఆదివారం శశి ప్రాంగణంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.





కనుల పండువగా గోదాదేవి కల్యాణం



తాళ్లపూడిలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



దేవరపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో గోదా రంగనాథుల కల్యాణం

నల్లజర్ల: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని అనంతపల్లిలోని రుక్మిణి, సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో శనివారం గోదా రంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు అగ్నిహోత్రుల సీతారామాచార్యులు, ఆలయ అర్చకుడు దివి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. గెడ్డాపు సూర్యనారాయణ దంపతులు పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.అధిక సంఖ్యలో హాజరైన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే అనంతపల్లి, తెలికిచెర్ల వేంకటేశ్వర స్వామి ఆలయాల్లోనూ గోదా రంగనాథుల కల్యాణోత్సవాలు జరిగాయి.

తాళ్లపూడి: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గోదా, రంగనాథుల కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోవర్ధనం చక్రవర్తి, వేద పండితుడు పెద్దింటి శ్యామ్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా ఈ వేడుక జరిగింది. గుండుబోగుల వంశీకులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండగలో భాగంగా భోగి రోజున గోదా,రంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తే అందరికీ శుభాలు కలుగుతాయని అర్చకుడు చక్రవర్తి అన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కొవ్వూరు: స్థానిక బసివిరెడ్డిపేటలో గోదాదేవి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వరద గోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం ఆలయం ప్రాంగణంలో వరద గోపాల స్వామి, గోదాదేవి కల్యాణం నిర్వహించారు.ఆలయ ఈవో ఎం.బాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధానార్చకుడు గోవర్ధనం అనంతగోపాల్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం రామాలయం వద్ద గోదాదేవి కళ్యాణాన్ని, హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు భోగి పండగను ఆనందంగా జరుపుకున్నారు. వేకువనే వీధివీధినా భోగి మంటలు వేశారు. వేళ్లచింతలగూడెంలో ఘంటా రంగారావు, మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

దేవరపల్లి: గౌరీపట్నంలోని శ్రీపర్వతంపై కొలువైన వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వైభవంగా శ్రీమన్నారాయణ యజ్ఞం జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం రాత్రి గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అవరాల రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణం జరపించారు. అలాగే దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో గోదా రంగనాథస్వామి వారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకూ కల్యాణం జరిగింది.

కత్తి దూసిన పందెం కోడి

- గ్రామాల్లో భారీ ఎత్తున బరుల ఏర్పాటు
- జాతరను తలపిస్తున్న కోడి పందేలు
- పేకాట, గుండాటలకు అనుమతి నిరాకరణ
- రూ. కోట్లలో చేతులు మారిన ఫైనం



దేవరపల్లిలో కోడి పందేల బరి వద్ద కోలాహలం



నల్లజర్లలో కోడిపందేల కోలాహలం

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా జోరుగా కోడి పందేలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి వరకూ అనుమతి కోసం ఎదురు చూసిన పందేల నిర్వాహకులు శనివారం ఉదయం 10 గంటల నుంచి పందెపు పుంజులకు కత్తులు కట్టి బరిలోకి దించారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాల్లో సుమారు 30 గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. దేవరపల్లి మండలంలో దేవరపల్లి, కురుకూరు, బందపురం, యర్నగూడెం, త్యాజంపూడి, యాదవోలు, ధుమంతునిగూడెం, సంగాయగూడేల్లో భారీగా బరులు ఏర్పాటు చేశారు. పందేల్లో పెద్ద మొత్తంలో సొమ్ములు చేతులు మారుతున్నాయి. ఒక్కో పందె రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ జరుగుతోంది. దేవరపల్లి-యాదవోలు రోడ్డులోని పామాయిల్ తోటలో పెద్ద ఎత్తున పందేలు నిర్వహిస్తున్నారు.

కొవ్వూరు నియోజకవర్గంలో 20 చోట్ల..

కొవ్వూరు: కొవ్వూరు నియోజకవర్గంలో శనివారం మధ్యాహ్నం రెండు గంటల వరకు పోటీలను అడ్డుకున్న పోలీసులు చివరికి చేతులెత్తేశారు. కేవలం కోడి పందేలకు మాత్రమే అనుమతించారు. గుండాట, కోతాట, పేకాట, వంటి ఇతర జూద క్రీడలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. కొన్నిచోట్ల జూదాలు కూడా నిర్వహించేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు వచ్చి, వాటిని నిలుపుదల చేశారు. కొవ్వూరు పట్టణంలో రెండు చోట్ల, ఐ.పంగిడి, తోగుమ్మి, పశివేదల, సీతంపేట, కుమారదేవం తదితర గ్రామాల్లో కోడి పందేలను నిర్వహించారు. పశివేదల, కొవ్వూరు, తోగుమ్మి గ్రామాల్లోని పలువురు ఇళ్లల్లో పేకాట నిర్వహించారు. చాగల్లు మండలంలోని చిక్కాల, చంద్రవరం, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, నందిగంపాడు, మీనానగరం గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20 చోట్ల కోడి పందేల బరులను ఏర్పాటు చేశారు. లక్షలాది రూపాయిలు చేతులు మారాయి. ఒక్కో పందెం రూ.10 వేల నుంచి రూ.1 లక్ష వరకూ నిర్వహించారు. తొలి రోజు సుమారు రూ.2 కోట్ల మేర చేతులు మారినట్టు అంచనా.

చాగల్లు: మీనానగరం, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, చిక్కాల, చంద్రవరం, నందిగంపాడు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. ఈ గ్రామాల తోటల్లో నిర్వాహకులు పందేలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నిడదవోలు నియోజకవర్గంలో 20 చోట్ల..

నిడదవోలు: నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 20 చోట్ల బరులను ఏర్పాటు చేసి జోరుగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. స్థానిక తీరుగూడెంలో ఏర్పాటు చేసిన బరిలో ఉభయగోదావరి జిల్లాలకు చెందిన పందెపు రాయుళ్లు పాల్గొన్ని భారీ ఎత్తున పందేలు కాశారు. ఇక్కడ ఒక్కో పందెం రూ.లక్షల్లో సాగింది. భారీ ఎత్తున జనాలు తరలి రావడంతో నిర్వాహకులు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి పందేలను ప్రత్యక్షంగా ప్రచారం చేశారు.

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, సింగవరం, డి.ముప్పవరం, విజ్జేశ్వరం గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. బరులు వద్ద గుండాటతో పాటు నిర్వాహకులు బిర్యానీ సెంటర్లు కూడా ఏర్పాటు చేశారు. పందేలకు వచ్చిన వారితో ఈ గ్రామాల్లో సందడి నెలకొంది. డి.ముప్పవరంలో కోడి పందేలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో తహసీల్దార్ ఎం.గంగరాజు అక్కడకు చేరుకుని కొద్దిసేపు బరిలో కూర్చొన్నారు. ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన అక్కడి నుంచి వెళ్లిన కొద్దిసేపటికే యథావిధిగా పందేలు జరిగాయి.

తాళ్లపూడి: పోలీసుల అంక్షల వల్ల కోడి పందేలు తాళ్లపూడి మండలంలోని కొంత ఆలస్యంగా మొదలయ్యాయి. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వాహకులు పందేలను ప్రారంభించారు. మండలంలోని తాళ్లపూడి, గజ్జరం, పెద్దేవం, వేగేశ్వరపురం, రావూరుపాడు తదితర గ్రామాల్లో ఎనిమిది చోట్ల కోడి పందేలు నిర్వహిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పందేల బరుల వద్ద సందడి చేశారు. తాళ్లపూడి ఎస్సై వెంకటరమణ పందేల వద్ద గుండాటలు వేయకుండా చర్యలు తీసుకున్నారు. సిబ్బందితో కలిసి ఆయన అన్ని బరులనూ పరిశీలించారు.

గుండాటకు నో

నల్లజర్ల: మండలంలో ఊరూరా కోడి పందేలు యథావిధిగా జరిగాయి. అయితే గుండాటకు పోలీసులు ఎక్కడా అనుమతి ఇవ్వలేదు. దాంతో నాయకులు ఒకింత అసహనానికి గురయ్యారు. ఎక్కడా మునుపటి ఉత్సాహం కనపడలేదు. నల్లజర్ల,అనంతపల్లి, పోతవరం, ప్రకాశరావుపాలెం, దూబచర్ల, గంటావారిగూడెం తదితర గ్రామాల్లో కోడిపందేలను నిర్వహించారు.

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం, రేగులగుంట, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, దొండపూడి, చిట్యాల, గంగోలు, గోపాలపురం గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. కోడి పందేల బరులు మద్యం, పలావు సెంటర్లతో కళకళలాడాయి. కోడి పందేల నిర్వహణకు చూసీచూడనట్టు వదిలేసినప్పటికీ, గుండాట మాత్రం నిర్వహించకుండా పందెపు బరుల వద్ద పోలీసులను ఏర్పాటు చేసి, నియంత్రించారు. దాంతో నిర్వాహకుల ఆదాయానికి బారీ గండి పడినట్లు గగ్గోలు పెడుతున్నారు.

